## క్లుప్తంగా

### నగదును ట్రెజరీ ఖాతాలో జమ చేయండి



సచివాలయం సిబ్బందితో సమీక్షిస్తున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాద్

రొళ్ల: పన్నులు, ఆధార్ అప్‌డేట్, ఓటీఎస్ ద్వారా వసూలైన నగదు మొత్తాన్ని వెంటనే ట్రెజరీ ఖాతాలో సచివాలయాల సిబ్బంది జమ చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాద్, ఈఓఆర్డీ క్రిష్టప్ప ఆదేశించారు. సోమవారం సాయంత్రం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సచివాలయాల సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాద్ మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో వాటర్ స్కీమ్ పథకం బోరుబావుల నుంచి అమర్చిన పైప్ లైన్ లీకేజీ లేకుండా ఎప్పటికప్పుడు సర్పంచులతో సమన్వయం చేసుకుని మంచినీళ్లు కలుషితం కాకుండా మరమత్తు చేయించాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

### చౌటిపల్లిలో కేబుల్ చోరీ

మడకశిరరూరల్: మండలంలోని చౌటిపల్లి గ్రామ సమీపంలో వ్యవసాయ బోరుకు అమర్చిన 30 మీటర్ల కేబుల్‌ను ఆదివారం రాత్రి దుండగులు దొంగలించుకెళ్లారని బాధిత రైతు రవీంద్రరెడ్డి తెలిపారు. మూడు రోజుల్లోనే రెండుసార్లు కేబుల్‌ను దొంగలించుకెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు నిఘా ఉంచి చోరీలు జరగకుండా చూడాలని కోరారు.

### ఆలయ ప్రహరీ నిర్మాణం



దండు మారెమ్మ గుడి ప్రహరీ నిర్మించిన దృశ్యం

హిందూపురం: పట్టణంలోని 27వ వార్డులోని దండు మారెమ్మ గుడికి ప్రహరీ లేకపోవడంతో ఇబ్బందిగా మారిందని స్థానికులు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక దృష్టికి తీసుకెళ్లారు. 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యాక్రమం నిర్వహించిన సమయంలో సమస్య పరిష్కరించాలని కోరారు. దీంతో వెంటనే స్పందించిన దీపిక రూ.50 వేలను ఆలయ కమిటీకి అప్పట్లోనే అందించారు. తాజాగా ఆలయ ప్రహరీ నిర్మాణం పూర్తయింది. మాటప్రకారం ప్రహరీ నిర్మాణానికి సహకరించిన ఎమ్మెల్యే అభ్యర్థి టీఎస్.దీపికకు దండు మారెమ్మ ఆశీస్సులతో ఎన్నికల ఫలితాల్లో విజయం చేకూరాలని అంబేడ్కర్‌నగర్ వాసులు ఆకాంక్షిస్తున్నారు.

### సోమందేపల్లిలో చోరీ

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని పాతూరులో నివాసం ఉంటున్న శ్రీనివాసులు ఇంట్లో సోమవారం దొంగతనం జరిగింది. శ్రీనివాసులు ఇంట్లో ఎవరూ లేకపోవడంతో సోమవారం తెల్లవారుజామున దుండగులు ఇంటి తాళాలు పగలకొట్టి బీరువాలో ఉంచిన తులం బంగారం ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న పోలీసులు క్లూస్ టీంకు సమాచారం అందించడంతో వారు ఇంటిని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

### కౌంటింగ్ ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలి



మాట్లాడుతున్న శిక్షణ అధికారి రోశయ్య

మడకశిరరూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆర్ఓ గౌరిశంకర్ ఆధ్వర్యంలో సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌పై అధికారులకు విధులపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్ రోశయ్య మాట్లాడుతూ జూన్ 4న నిర్వహించే కౌంటింగ్‌కు సిబ్బంది తెల్లవారజామున 4 గంటలకే కౌంటింగ్ రూముల వద్దకు చేరుకోవాలన్నారు. ఓట్ల లెక్కింపుపై అవగాహనతో సజావుగా కౌంటింగ్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై వారికి అవగాహన కల్పించారు. శిక్షణ కార్యక్రమంలో ఏఆర్ఓ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, ఎంఈఓ భాస్కర్, అధికారులు పాల్గొన్నారు.

### మండలానికి చేరిన సబ్సిడీ వేరుశనగ

రొద్దం: రైతులకు పంపిణీ చేయడానికి ప్రభుత్వం సబ్సిడీ విత్తన వేరుశనగ మండలానికి సరఫరా చేసినట్లు ఏఈఓ అంజాద్ సోమవారం తెలిపారు. మండలంలో కొని రైతు భరోసా కేంద్రాలకు ఇప్పటికే వేరుశనగ చేరిందన్నారు. 201 క్వింటాళ్ల వేరుశగన సరఫరా అయిందన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చిన వెంటనే రైతులకు పంపిణీ చేస్తామన్నారు.

# శరవేగంగా బ్రిడ్జి నిర్మాణ పనులు

- జయమంగళి నదిపై తుది దశకు చేరిన బ్రిడ్జి నిర్మాణ పనులు
- ఇదివరకే పెన్నానదిపై అందుబాటులోకి వచ్చిన బ్రిడ్జి
- కష్టాలు తొలగడంతో ప్రయాణికుల హర్షం

పరిగి: మండలంలోని జయమంగళీ నదిపై వంతెన నిర్మాణ పనులు తుది దశకు చేరాయి. హిందూపురం వైపు నుంచి మడకశిర, అమరాపురం, కర్ణాటక ప్రాంతాలైన పావగడ, చిత్రదుర్గం, కళ్యాణదుర్గం, రాయదుర్గం తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు గతంలో ఆర్అండ్‌బీ పరిధిలో ఉన్న ఈ రోడ్డును జాతీయ రహదారిగా మార్చి, విస్తరించడానికి నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా చర్యలు చేపట్టింది. ఇందుకోసం నేషనల్ హైవే 544ఈఈతో అనుసంధానిస్తూ కొడికొండ చెక్‌పోస్టు నుంచి లేపాక్షి, చోళసముద్రం, కొల్లకుంట మీదుగా పరిగి మండలంలోని ధనాపురంతో కలుపుకుని మడకశిర మీదుగా కర్ణాటకలోని శిర వరకూ గతంలో నేషనల్ హైవేను నిర్మించారు. దీనికి అనుసంధానంగా పరిగి మండలంలోని ధనాపురం క్రాస్ నుంచి హిందూపురం మీదుగా లేపాక్షి మండలంలోని చోళసముద్రం వరకూ జాతీయ రహదారిని ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టారు. ఇప్పటికే దాదాపుగా పనులు పూర్తి అయ్యాయి. పెన్నా, జయమంగళీ నదులపై ఉన్న సింగల్ లేన్ నిర్మాణ బ్రిడ్జిలకు అనుసంధానంగా డబుల్ లేన్‌లతో కొత్తగా వంతెనలను నిర్మిస్తున్నారు. రోడ్డు విస్తరణ పనులతో పాటూ బ్రిడ్జిల నిర్మాణాలు పూర్తయితే ప్రయాణికుల కష్టాలు తీరినట్లే.



జయమంగళీ నదిపై నిర్మిస్తున్న బ్రిడ్జి

#### రూ.86.55 కోట్ల వ్యయంతో ...

నేషనల్ హైవే అథారిటీ ఆధ్వర్యంలో పరిగి మండలంలోని ధనాపురం క్రాస్ నుంచి హిందూపురం మీదుగా లేపాక్షి మండలంలోని చోళసముద్రం వరకూ జాతీయ రహదారి ఏర్పాటు చేస్తున్నారు. దీనికోసం 20.04 కిలో మీటర్ల రోడ్డు విస్తరణతో పాటూ నిర్మాణానికి రూ.86.55 కోట్లను ఖర్చుపెట్టారు. ఇందులో భాగంగా పెన్నా, జయమంగళీ నదులపై రెండు వంతెనలను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం హిందూపురం నుంచి సేవా మందిరం, కొడిగెనహళ్లి, కాలువపల్లి క్రాస్, పరిగి మీదుగా ధనాపురం క్రాస్ వరకూ రోడ్డు విస్తరణ పనులు దాదాపుగా పూర్తీ అయినట్లు అధికారులు తెలిపారు. త్వరలోనే జయమంగళీ నది బ్రిడ్జ్ నిర్మాణాన్ని పూర్తీ చేసి, ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

#### వేగంగా బ్రిడ్జి పనులు

పరిగి మండల కేంద్రంలోని జయమంగళీ నదిపై కొత్తగా నిర్మిస్తున్న బ్రిడ్జ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే పనులన్నీ తుది దశకు చేరుకున్నాయి. గతంలో సింగిల్ లేన్ బ్రిడ్జ్‌కు అనుసంధానంగా మరో బ్రిడ్జ్‌ను రెండు లేన్లతో నిర్మిస్తున్నారు. దాదాపు 250 మీటర్ల పొడవైన ఈ బ్రిడ్జ్ నిర్మాణానికి రూ.11.39 కోట్లు వెచ్చిస్తున్నట్లు అధికారులు తెలిపారు. మొత్తం 9 పిల్లర్లపై సిమెంట్ బెడ్డింగ్ బీమ్స్ పనులు పూర్తీ చేశారు. త్వరలోనే పనులు పూర్తీ చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

#### పెన్నా బ్రిడ్జిపై రాకపోకలు

నేషనల్ హైవే నిర్మాణంలో భాగంగా పెన్నా నదిపై నిర్మించిన బ్రిడ్జ్ పనులు పూర్తయ్యాయి. దాదాపు 150 మీటర్ల పొడవైన దీని నిర్మాణానికి రూ.7.10 కోట్లను ఖర్చు చేసినట్లు అధికారులు తెలిపారు. పరిగి వైపు నుంచి హిందూపురం వైపుకు వెళ్లేందుకు ఇదొక్కటే ప్రధాన మార్గంగా ఉండేది. వేరే మార్గం లేక తరచూ ప్రయాణికులు ఇబ్బందులు పడేవారు. అయితే ఇటీవల కొడికొండ చెక్‌పోస్టు నుంచి కర్ణాటక ప్రాంతం శిర వరకూ నిర్మించిన నేషనల్ హైవే 544ఈఈతో ప్రత్యామ్నాయ రోడ్డుతో హిందూపురం నుంచి పరిగి మీదుగా మడకశిర, పావగడ, కళ్యాణదుర్గం, రాయదుర్గం, బళ్లారి తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు దోహదపడుతోంది. పెన్నా నదిపై నిర్మించిన కొత్త వంతెనతో కర్ణాటక ప్రాంతాలైన మధుగిరి మీదుగా తుమకూరు, హాసన్, టిపటూరు, ధర్మస్థలం, మంగళూరుకు వెళ్లేందుకు మార్గం సుగమమయ్యింది.



సేవా మందిరం వద్ద అందుబాటులోకి వచ్చిన నూతన బ్రిడ్జి

## 'పురం'పై ఎగిరేది వైఎస్సార్‌సీపీ జెండానే



పార్టీ నాయకులను ఉద్దేశించి మాట్లాడుతున్న వేణురెడ్డి

చిలమత్తూరు: హిందూపురం కోటపై ఎగిరేది వైఎస్సార్‌సీపీ జెండానే. పార్టీ శ్రేణులందరూ సంబరాలకు సిద్ధంగా ఉండాలని ఆ పార్టీ నాయకుడు వేణురెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నాయకులతో సమావేశమయ్యారు. వేణురెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో టీడీపీ నిర్మించిన ఇసుక మేట కూలిపోబోతోందని వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల్లో బాగా కష్టపడ్డారని, వారి కృషి ఫలితంగానే ఎమ్మెల్యేగా దీపిక విజయం సాధించనున్నారని పేర్కొన్నారు. అక్రమ కేసులకు బలైన ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, పార్టీ నాయకులకు త్వరలోనే బెయిల్ వస్తుందని, పార్టీ శ్రేణులు ఆందోళన చెందవద్దన్నారు. కార్యక్రమంలో నాయకులు అన్సర్ అహ్మద్, మాజీ మండల కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, సర్పంచులు శంకర్‌రెడ్డి, మురళి, లక్ష్మీపతిరెడ్డి, ఎంపీటీసీలు రాఘవేంద్రరెడ్డి, మంజునాథ్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ దివాకర్‌రెడ్డి, కులశేఖర్‌రెడ్డి, షాకీర్, నారాయణస్వామి, శ్రీనాథ్‌రెడ్డి, రవికుమార్, శ్రీనివాసరెడ్డి, జయశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కౌంటింగ్‌పై సిబ్బందికి శిక్షణ



వివిధ పార్టీల నాయకులతో సమావేశమైన సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్



శిక్షణలో పాల్గొన్న సిబ్బంది

పెనుకొండ: పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో భువన విజయం సమావేశపు భవనంలో సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్ ఆధ్వర్యంలో ఎన్నికల కౌంటింగ్‌పై సోమవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. కౌంటింగ్ నిర్వహణ, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు, ఈవీఎం ఓట్ల లెక్కింపు తదితర వాటి గురించి అవగాహన కల్పించారు. ఏ చిన్న సమస్య ఉన్నా పొరబాట్లకు తావివ్వకుండా అన్ని రాజకీయ పార్టీల నాయకుల ఏకాభిప్రాయంతో నిర్ణయం తీసుకోవాలన్నారు. సమావేశంలో కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్‌లు, మైక్రో అబ్జర్వర్లు, తహసీల్దార్లు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

#### కౌంటింగ్‌కు సహకరించండి

కౌంటింగ్‌కు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్ పేర్కొన్నారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, స్వతంత్ర అభ్యర్థులతో సబ్‌కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 4న హిందూపురం సమీపంలోని బిట్ కళాశాలలో ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభమవుతుందన్నారు. ఇందుకు సంబంధించి ఆయా రాజకీయ పార్టీలు ఏజెంట్లను నియమించుకోవాలన్నారు. ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూం నుంచి ఈవీఎంలను బందోబస్తే నడుమ తరలిస్తామన్నారు. అనంతరం ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. ఏ చిన్న సమస్య ఉన్నా సమన్వయంతో సమస్యను పరిష్కరించుకోవాలన్నారు.

## సేవలు సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న యూనియన్ బ్యాంకు రీజనల్ మేనేజర్ జితేంద్ర మిశ్ర

హిందూపురం టౌన్: యూనియన్ బ్యాంకు సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంకు రీజినల్ మేనేజర్ జితేంద్ర మిశ్రా తెలియజేశారు. పట్టణంలోని వాసవీ ధర్మశాలలో సోమవారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవలపై (మెగా రిటైల్ ఎక్స్‌పో) మెగా అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక యూనియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ దయాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రీజినల్ మేనేజర్ విచ్చేసి తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జితేంద్ర మిశ్రా మాట్లాడుతూ దేశంలోనే అత్యధిక గుర్తింపు పొందిన బ్యాంకుల్లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఒకటన్నారు. బ్యాంకు నియమ నిబంధనల మేరకు వివిధ రకాల రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. పట్టణ గ్రామీణ ప్రాంతాలలో మరింత మెరుగైన సేవలు అందించాలన్న ఉద్దేశంతో ప్రత్యేకంగా మెగా రిటైల్ ఎక్స్ పో (రుణమేళ) అవగాహన సదస్సు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌హెచ్ యదుభూషణ్‌రెడ్డి, ఆర్ఎల్‌పీ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

### దిగంబర స్వాముల పాదయాత్ర



చిలమత్తూరు: జైనముని అంతర్మాన ప్రసన్న సాగర చేపట్టిన మంగళ ప్రవేశ శోభాయాత్ర సోమవారం రాష్ట్రంలోని కొడికొండ చెక్‌పోస్టులోకి ప్రవేశించింది. దిగంబరుడైన జైన ముని భక్తులు, శిష్యులు, శ్వేతాంబరులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. వారు సోమవారం రాత్రి కోడూరు థామస్ మన్రో తోపు సమీపంలో బస చేశారు. రాజస్తాన్ నుంచి వారు శోభాయాత్ర చేపట్టారు. సీఐ ఈరన్న ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

### అనాథ శవానికి అంత్యక్రియలు

గుడిబండ: మండల కేంద్రంలోని గుడిబండ కొండ పక్కన పెద్ద బండరాయి కింద మారెమ్మ అనే ఒంటరి మహిళ రెండేళ్లుగా నివాసం ఉండేది. అయితే అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందింది. ఆమెకు బంధు,మిత్రులు ఎవరూ లేకపోవడంతో వాల్మీకులు మానవతా దృక్పథంతో సోమవారం అంత్యక్రియలు పూర్తి చేశారు. జనార్దన్, కరుణాకర్, అనిల్, శ్రీనివాసులు, చిరంజీవి, పాండిని గ్రామ ప్రజలు అభినందించారు.

### హుండీ కానుకల లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

హిందూపురం: పట్టణంలోని సూగూరు ఆంజనేయ స్వామి, వేణుగోపాలస్వామి ఆలయాల్లోని హుండీ కానుకలను కర్నూలు డీసీ కార్యాలయ పర్యవేక్షకులు వన్నూరుస్వామి పర్యవేక్షణలో లెక్కించినట్లు ఈఓ నరసింహరాజు తెలిపారు. సూగురు ఆంజనేయస్వామి ఆలయానికి రూ.86,325, వేణుగోపాలస్వామి ఆలయానికి రూ.1,13,160 ఆదాయం వచ్చిందన్నారు.

### రుతుక్రమంపై అవగాహన

గోరంట్ల: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని వానవోలు అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం రుతుక్రమంపై మహిళలు, కిషోర బాలికలకు ఐసీడీఎస్ అధికారులు అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ అధికారులు మాట్లాడుతూ మహిళలకు రుతుక్రమం అనేది చాల ముఖ్యమైనదన్నారు. రుతుక్రమంపై గ్రామీణ ప్రాంత మహిళలు అవగాహన పెంచుకోవాలన్నారు. నెలసరి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను మహిళలకు, కిషోర బాలికలకు వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరాణి, అంగన్‌వాడీ వర్కర్లు జ్యోతి, శోభ, హెల్పర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

### పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

మడకశిరరూరల్/రొళ్ల: ఉపాధి పథకం 2024–25 ఆర్థిక సంవత్సరానికిగాను పండ్ల తోటలు పెంపకానికి ఆసక్తి ఉన్న రైతులు ఈ వారం లోపు దరఖాస్తులు చేసుకోవాలని ఉపాధి పథకం మడకశిర, రొళ్ల ఏపీఓలు శ్రీకాంత్‌గౌడ్, ఓబుళప్ప తెలిపారు. మడకశిర మండలంలో 500 ఎకరాల్లో పండ్లు మొక్కల పెంపకం చేపట్టే విధంగా చర్యలు చేపట్టామన్నారు. అలాగే రొళ్ల మండలంలో 300 ఎకరాలు పండ్ల తోటల పెంపకానికి అనుమతి వచ్చిందన్నారు. మండలంలో ఐదెకరాలల్లోపు భూములు కలిగిన సన్న, చిన్నకారులు రైతులు పండ్లతోటల పెంపకానికి దరఖాస్తులు చేసుకోవచ్చునని తెలిపారు. డ్రైలాండ్ హార్టికల్చర్ ద్వారా మామిడి, కొబ్బరి, చింత, జామ, అల్లనేరేడు, డ్రాగన్ ఫ్రూట్, దానిమ్మతో పాటు రోజ, మల్లెపూలు తోటలు, మునగా చెట్లు పెంపకానికి అవకాశం ఉందన్నారు. పండ్లతోటలు పెంపకానికి మంజూరైన రైతులకు మూడేళ్ల పాటు మొక్కల సంరక్ష కోసం బిల్లుల రూపంలో చెల్లించడం జరుగుతుందన్నారు. ఆసక్తిగల రైతులు పట్టదారు పాసు పుస్తకం, సన్న, చిన్నకారు రైతుగా తహసీల్దార్ కార్యాలయంలో అథెంటికేషన్ చేయించుకోవడంతో పాటు ఆధార్, బ్యాంక్‌ఖాతా జిరాక్స్ కాపీలు జత చేసి సంబంధిత క్షేత్ర సహాయకుడికి లేకపోతే మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

### 27 వాహనాల సీజ్



అమరాపురం: ఆర్‌సీలు లేని బైకులను సీజ్ చేసిన దృశ్యం

అమరాపురం: ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మడకశిర రూరల్ సీఐ.రాజకుమార్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని మద్దనకుంటలో ఎస్ఐ.జనార్ధననాయుడు ఆధ్వర్యంలో సీఐ.గుడిబండ, రొళ్ల, అగళి ఎస్‌ఐలతో పాటు మడకశిర సర్కిల్ సిబ్బందితో కలసి సోమవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానితుల ఇళ్లలో సోదాలు చేశారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 27 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్ఐ జనార్ధననాయుడు తెలిపారు.

### కర్ణాటక మద్యం స్వాధీనం

చిలమత్తూరు: మండలంలోని కొడికొండలో చిలమత్తూరు పోలీసులు సోమవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానితుల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. కోతుల రమేష్ అనే వ్యక్తి వద్ద నుంచి 192 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ గంగాధర్ తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఏఎస్ఐ గురుస్వామి, కానిస్టేబుళ్లు రమేష్ నాయక్, వేమనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అండర్-13 ఫుట్‌బాల్ టోర్నీ విజేత 'పురం'



అండర్-10 విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన బత్తలపల్లి జట్టు



అండర్-13 విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన హిందూపురం యునైటెడ్ జట్టు

హిందూపురం టౌన్: జిల్లా ఫుట్‌బాల్ క్లబ్ ఆధ్వర్యంలో హిందూపురం యునైటెడ్ ఫుట్‌బాల్ క్లబ్ నిర్వహించిన ఏఐఎఫ్ఎఫ్ గ్రాస్ రూట్ బ్లూ అండర్-10, 13 చాంపియన్ షిప్-2024 పోటీలు స్థానిక ఎస్‌డీజీఎస్ కళాశాల మైదానంలో నిర్వహించారు. ఆదివారం పోటీలు ముగియగా అండర్-10 విభాగంలో ప్రథమ స్థానంలో బత్తలపల్లి, ద్వితీయ స్థానంలో హిందూపురం టౌన్, తృతీయ స్థానంలో హిందూపురం యునైటెడ్ జట్లు నిలిచాయి. అలాగే అండర్-13 విభాగంలో ప్రథమ స్థానంలో హిందూపురం యునైటెడ్, ద్వితీయ స్థానంలో కదిరి, తృతీయ స్థానంలో ధర్మవరం జట్లు నిలిచాయి. సోమవారం జరిగిన ట్రోఫీ ప్రదానోత్సవానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ సాదిన్‌రెడ్డి హాజరై గెలుపొందిన జట్లకు ట్రోఫీలు, పతకాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సంఘం ఉపాధ్యక్షుడు ఇర్షాద్ అలీ, కార్యదర్శి మహమ్మద్ సలీం, కోశాధికారి శేఖర్, ఈసీ మెంబర్ విజయవాణి, పీడీ లోకనాథ్, జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు.

### నృసింహుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే అభ్యర్థి



ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్పకు జ్ఞాపిక అందిస్తున్న కమిటీ సభ్యులు

మడకశిరరూరల్: కదిరి లక్ష్మీనరసింహస్వామిని సోమవారం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆశీర్వదించి తీర్థప్రసాదం అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఈరలక్కప్పకు పూల మాల వేసి శాలువ కప్పి జ్ఞాపికను అందజేసి సన్మానించారు. హిందూపురం పార్లమెంట్ ఇన్‌చార్జ్ వజ్ర భాస్కర్‌రెడ్డి తదితరులు ఆయన వెంట ఉన్నారు.

### ఆర్బీకేల్లో రేపు విత్తన పంపిణీ

మడకశిరరూరల్: మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో బుధవారం విత్తన వేరుశనగ కాయలను పంపిణీ చేయనున్నట్లు ఏఓ తిమ్మప్ప తెలిపారు. ఖరీఫ్ వేరుశనగ పంట సాగుకు సకాలంలో గ్రామ స్థాయిలోనే విత్తన కాయలు పంపిణీ చేస్తామన్నారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు ఆర్బీకేల్లో విత్తన కాయలను పొందాలన్నారు.

### 1న హనుమాన్ శోభాయాత్ర

హిందూపురం: హనుమద్ జయంతి సందర్భంగా పట్టణంలో జూన్ 1వ తేదీన హనుమాన్ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు హిందూ సురక్ష సేవా సమితి సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. 1వ తేదీ ఉదయం 10 గంటలకు సూగురు ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. హనుమాన్ చాలీసా పారాయణం అనంతరం శోభాయాత్ర ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. సూగురు నుంచి చిన్న మార్కెట్ సర్కిల్ మీదుగా మెయిన్‌రోడ్డు, గాంధీ, ఎన్టీఆర్ సర్కిల్, రైల్వే రోడ్డు, నంది సర్కిల్, నానెప్పనగర్ మీదుగా మోడల్ కాలనీలోని వ్యాసరాయ ఆంజనేయస్వామి వరకు శోభాయాత్ర ఉంటుందన్నారు. హనుమద్ భక్తులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

### వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



మారెన్న (ఫైల్)

పెనుకొండ రూరల్: మండలంలోని మావటూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మారన్న (55) సోమవారం ఉదయం గుండెపోటుతో చనిపోయారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆయన భౌతికకాయం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

### 30న ఉచిత వైద్య శిబిరం

రొళ్ల: మండల పరిధిలోని అగ్రహారం గ్రామంలో ఈనెల 30న బెంగళూరు చెందిన సంరక్ష ప్రైవేట్ ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు డాక్టర్ డి.రామక్రిష్టప్ప తెలిపారు. దివంగత శారదమ్మ తిప్పేస్వామి జ్ఞాపకార్థం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. హార్ట్, బీపీ, షుగర్‌తో పాటు కంటి పరీక్షలు, రక్తదానంతో పాటు, టూడీ ఏకో, ఈసీజీ వంటి పరీక్షలు చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పరిగి:మండల కేంద్రంలోని 33/11 కేవీ పరిగి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు మంగళవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు మండల ట్రాన్స్‌కో ఏఈఈ నిజాముద్దీన్ తెలిపారు. పరిగి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అత్యవసర మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలోని పరిగి, శాసనకోట, పి నరసాపురం, పైడేటి, జంగాలపల్లి, హొన్నంపల్లి, శిరేకోలం, కాలువపల్లి తదితర గ్రామాలకు సరఫరా నిలిపి వేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

### నేడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

లేపాక్షి: మండల కేంద్రమైన లేపాక్షిలోని ఆర్‌జేహెచ్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఉదయం 10.30 గంటలకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం జరుగుతుందని మండల కన్వీనర్ నారాయణస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందూపురం ఎమ్మెల్యే అభ్యర్థి దీపిక హాజరవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.